# ఎందుకోసం

శ్రీమతి స. అచ్యుతవల్లి

అవి హైస్కూలులో ఫోర్తు ఫారం చదువుతున్న రోజులు వేదవతికి పధ్నాలుగేళ్ళు దాటాయి. ఏడాదినించే ఓణీలు వేసుకుంటోంది. శ్రావణమాసం. కాసులు జరుగుతూండగానే పెద్దవాన జల్లు వచ్చి క్లాసులు అయిపోయ్యేసరికి పెళ్ళుమంటూ మబ్బు విడిచిన ఎండ వచ్చేసింది. శ్రావణ మంగళవారం పేరంటానికి వెళ్ళాలని హడావిడిగా పరుగులు పెట్టుకుంటూ వచ్చింది ఇంటికి. వేదవతికింకా ఇద్దరు తమ్ముళ్ళూ ఇద్దరు చెల్లెళ్ళూ వున్నారు. ఉదయాన్నే స్కూలుకి వెళ్ళేటప్పుడు చామంతి పూలు, దవనం కోసి వుంచమని తల్లితో చెప్పింది. కొన్నదో లేదో అనుకుంటూ ఆషాఢమాసం చివరి ఆదివారం పెట్టుకున్న గోరింటాకుతో పండిన గోళ్ళని చూసుకుంటూ గుమ్మంమెట్లు ఒక్క అంగలో ఎక్కబోయి చివరి మెట్టు మీద స్థాణువులా నిలబడిపోయింది. జానకమ్మ ఎగరొప్పుతూంది. తండ్రి గోవర్ధనం అప్పుడే క్యాంపునించి వచ్చినట్లున్నాడు. ఇంకా ఆఫీసు బట్టలు విప్పలేదు.

“ఆ మాటే వాగొద్దన్నాను. మగాడ్ని! నా ఇష్టం వచ్చినట్లు నేను ఖర్చుపెట్టుకుంటాను. నువ్వెవరివి అడగడానికి? నా ఇష్టం వచ్చినట్లు నేను తిరుగుతాను. నీకెందుకు!” అరుస్తున్నాడు.

“అవును మరి! నాకెందుకు? నేనెవర్ని? నేనెవర్ని కావాలనుకుని ఈ పెళ్ళి చేసుకున్నారు? ఇంతమంది పిల్లల్ని కన్నారు? ఒక వంక పిల్ల పెళ్ళికి ఎదిగి వస్తూన్నా కూడా మీ ఖర్చులూ, తిరుగుళ్ళూ మానక పోతే ఎలాగ? ఎవరయినా మగాళ్ళు కాంపుల నుంచి ఇంటికి వస్తూ భార్యకీ, పిల్లలకీ కూరో కాయో, పండో తెస్తారు. మీరో ఇంట్లోంచి పట్టుకు వెళ్ళినదల్లా టి. బి. ల్లోనూ, లాడ్జింగుల్లోనూ తగలేస్తారు. ఈ సంసారం నేను ఈదలేను. పిల్ల పెళ్ళి కెదుగుతోంది. ఏదో వార్షికంలా తింటానికిన్ని గింజలు తెస్తారు. పేరుకి పెద్ద తాశిల్దారు పిల్ల మెళ్ళో సావు బంగారమన్నా పెటలేదు. పట్టుమని పది గుడ్డలైనా విడవా మడవాలేవు.”

“వెధవ వస వదుల్తావా నాలుగుచ్చుకుంటావా! నాలుగు రోజులాయి క్యాంపుకి వెళ్ళి కొట్టుకు కొట్టుకు వచ్చేను. మొగుడు వెధవ ఇంటికి రాగానే అయ్యో ఇంటియజమాని వచ్చేడు కాఫీ కావాలో, స్నానమే చేస్తారో అన్న తపనలేదు. వాళ్ళతో కులికావు వీళ్ళతో కులికావు. మాకు అవిలేవు, మాకు ఇవిలేవు అని ఏడుపులు. ఆడముండవి, ఇంట్లో పిల్లల్ని చూసుకుంటూ పడివుండక ఈ రండా గొండి చేయటమేమిటి? ఛ ఛ! ఇంటికి రావాలంటేనే నరకం జ్ఞాపకం వస్తోంది.”

“నరకంకాక స్వర్గంలా వుంటుందా? సోలెడు పాలతో అరుగురం కాఫీలూ, మజ్జిగలూ గడుపుకోవాలి! అయిదుగురు పిల్లల్ని కన్న పెళ్ళాం జవసత్వాలుడిగిపోక మిమ్మల్ని ఆకర్షించి వయ్యారాలొలకపోసే నావసాములవుతారా? కనపడ్డ ఆడదాన్నల్లా వెంటేసుకుని. సినిమాలూ, షికార్లూ తిరుగుతూ కూరుంటే మీకు ఇల్లు స్వర్గంలా, నేను భూలోకరంభలా ఎల్లాగుంటాను!” గోవర్ధనం వెనక్కి తిరిగి చూసేడు. చివరి మెట్టు మీద నించున్న వేదవతి కన్పించింది. ఎదిగిన కూతురు ముందు తన్ని చివాట్లేసే భార్యని చూసేసరికి ఉక్రోషం ముంచుకువచ్చింది.

“ఎన్నిసార్లు చెప్పినా వెధవ వాగుడు కట్టిపెట్టవు కదూ! చావుముండా! నువ్వూ నీ పిల్లలూ గంగలో దూకి చావండి. నీ బాబు ఇచ్చిన ముత్యాలమూట నేనేం తగలెయ్యటంలేదు. నా రెక్కల కష్టం నేను నా ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకుంటాను. వెధవ హరాము మానేసి నోరుమూసుకుని పడివుండు” అంటూ జుట్టు వంగదీసి మెడ మీద ధభీదభీ నాలుగు గుద్దులువేసి చేతులు దులుపుకొని పరు జేబులో వేసుకుని బయటకు వెళ్ళిపోయేడు గోవర్ధనం.

“తన్నండి. మీకు చేతనయినది నన్ను తిట్టికొట్టటమేగా! తన్నగా తన్నగా ఎప్పుడో ఆ కాస్త ప్రాణం గుటుక్కుమంటుంది. తర్వాత మీరూ మీ పిల్లలూ ఏ గంగలో దూకుతారో నాకూ అనవసరమే!” అంటూ జానకమ్మ దెబ్బలు తిన్నా వెళ్ళిపోయిన భర్తనుద్దేశించి ఇంకా ఏదో అంటూనే.

“వచ్చేవా? రా తల్లీ రా. ఆ కుంపట్లో కాసిని బొగ్గులు పడేసి రాజేసి కాసిని నీళ్ళు పెట్టు. టీ చేస్తాను” అంటూ వసారాలో నేలమీద ఒక చిరుగుల బొంత వేసుకుని పడుకుంది. తను స్కూల్లో వున్నంతసేపు తల్లితో కలిసి పేరంటాలకి వెళ్ళాలని తహతహలాడింది. చామంతులూ, దవనం తల్లో పెట్టుకోవాలని మురిసిపోయింది.

“ఛ ఛ! నాన్న ఇవాళే రావాలా క్యాంపునించి శనిగ్రహంలాగ? రేపు వచ్చినా బాగుండును” అని విసుక్కుంది వేదవతి. పుస్తకాలు ఒక మూలకి గిరవాటు పెట్టి తల్లి చెప్పినట్టు కుంపట్లో బొగ్గులు వేసి కాగితం ముక్కలతో నిప్పు రాజెయ్యటానికి కూర్చుంది వేదవతి. గోవర్ధనం ఎప్పుడు క్యాంపుకి వెళ్ళివచ్చినా జానకమ్మ ఏదోవక గొడవపెట్టటం. కాస్సేపు ఒకళ్ళనొకళ్ళు మాటల బాణాలతో పొడుచుకున్నాక చివరికి గోవర్ధనం బరస్టు అయిపోయి నాలుగుతన్ని బయటకు పోయి తిరిగి తిరిగి ఏ అర్ధరాత్రికో ఇల్లుచేరటం. ఇంక ఆ పూట, మర్నాడూ కూడా తల్లీ పిల్లలూ అరి చేతుల్లో ప్రాణాలు పెట్టుకుని బ్రతకటం. నాలుగు రోజులు ఇల్లా ముభావంగా అతి భయంకరమయిన ప్రశాంతతతో పిల్లల గుండెలు కములుపోయేలా గడిపినాక మళ్ళీ గోవర్ధనం అయిదో పదో ఇంటిఖర్చుకి జానకమ్మకి ఇచ్చి కాంపుకి వెళ్ళిపోవటం. ఇలా జాన

తమ్మ సంసారం ఓటి పడవలా నడు స్తోంది. పిల్లలకి తండ్రి అంటే దెబ్బలాట కోడుగా, కోపిష్టిగా కనిపించుతాడు తప్ప, వాళ్ళకి కావల్సిన సౌకర్యాలన్నీ తండ్రిని అడిగి పొందవచ్చుననే ఆర్ద్రిత కన్పిం చదు గోవర్ధనంలో వాళ్ళకి. వేదవతికి తల్లీ తండ్రి తమ సంసారం తిరు తెమ్మిలా చూస్తున్న కొద్దీ, పెళ్ళి అంటే ఒక విధమయిన భయం పట్టుకుంది. వేద వతి స్కూల్ ఫైనల్ పాసయింది. ప్రక్కింటి రామారావుగారి అబ్బాయిమూర్తి వేదవతిని పెళ్ళిచేసుకుంటానని అడిగాడు. జానకమ్మ సంతోషించింది. వేదవతికి ఏదో అవ్యక్తమయిన భయం వళ్ళంతా జరజర ప్రాకింది. "నేను పెళ్ళి చేసుకోను, ఏదో వుద్యోగం చేసుకుంటాను. తమ్ముళ్ళనీ, చెల్లెళ్ళనీ బాగా చదివించుతాను. ఇంక నాన్నని మన ఇంటికి రావొద్దను. తాగి నానాగొడవా చేస్తుంటే చదువు కూడా పిల్లల బుర్రలకి ఎక్కదు. మనం ఎక్కడి కయినా వేరే వెళ్ళిపోదాం. తమ్ముళ్ళు మంచి గౌరవమయిన ఉద్యోగాలు చేస్తారు. నిన్ను గౌరవంగా, పూవుల్లో పెట్టి పూజిస్తారు" అంది వేదవతి.

"ఛీ అదేమిటే పిచ్చిపిల్లా! మాకోసం నువ్వు పెళ్ళి మానుకోవటం ఎందుకు? మీ నాన్నగారికి తీరుబలేకకాని ఆయన సంపా దన కాస్తా కూస్తానా? లక్షణంగా కట్న కానుకలు ఇచ్చి పెళ్ళి చేయలేకపోయినా

---

ఎన్నికల సమయాల్లో చెరుకు వాడ వెంకట నరసింహంగారు కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ఎన్ని కల సభలలో ఉపన్యసించి వారిని గెలిపించేవారు. ఒకసారి ఆయనే ప్రజాపార్టీ తరపున అభ్యర్థిగా నిల బడి. "ఇంతవరకూ నేను యితరు లకు మంత్రసానితనం చేశాను. ఇప్పుడీ వృద్ధాప్యంలో, మంత్రసానే గర్భవతై కూర్చుంది. నాకు నేనే పురుడు పోసుకోవలసిన విపరీత స్థితి దాపురించింది" అన్నారొక సభలో.

---


ఏదో నీ అదృష్టం కొద్దీ ఆ పిల్లవాడు కోరి చేసుకుంటానన్నాడు. నీకు కళ్యాణకార కలిసివచ్చింది. ఏదో మా తిప్పలు మేం పడతాం! మీ నాన్నగారైనా ఏం చేయ గలరు? ఒకొక్క మగవాళ్ళు ఆడవాళ్ళ దురదృష్టం కొద్దీ ఏదో వ్యసనాలపాలు అవుతారు. పుణ్యం కొద్దీ పురుషుడు అన్నారు. నా పూర్వజన్మ సుకృతం, ఏం చేస్తాం? అల్లాంటి బెంగలేమీ మనస్సులో పెట్టుకోకు. చిన్న పిల్లవి ఆడుతూ, పాడుతూ వుండాల్సిన రోజులు" అని సముదాయించింది జానకమ్మ.

"అమ్మా! అయిదుగురు పిల్లల తల్లివి అయినావు. మేమంతా పెరుగుతున్నాము. నువ్వు చింకి బట్టలు కట్టుకుని నాన్నతో తగూలుపడుతూ తన్నులు తింటూ, ఎన్నాళ్ళనించీ ఈ సంసారం ఈడ్చుకుని వస్తున్నావు? ఎప్పటి కయినా నీకు ప్రశాంతమయిన జీవితం గడపాలనుం డదా? యాభయ్ ఏళ్ళు వస్తూన్నా బాధ్యత లేకుండా తుచ్ఛమయిన వాంఛలతో కాలం కరిగిస్తున్న నాన్నవల్ల మనకు ప్రయో జనం ఏముంది? నాన్న తెచ్చిఇచ్చే, అయిదూ పదీ, నేనే సంపాదిస్తాను. మనం జాగ్రత్తగా ఏ వడుదుడుకులూ లేకుండా బ్రతుకుదాము" అంది వేదవతి.

"నీకేం తెలీదు. వుత్త పిచ్చిదానివి! నేనేదో బాధపడుతున్నాననే ఆరాటం తప్ప లోకజ్ఞానం తెలీదు. నీ కెందుకు పెద్దవాళ్ళ గొడవలు!" అంది జానకమ్మ. వేదవతి ఎంత నచ్చ చెప్పినా తండ్రితో తెగ తెంపులు చేసుకోవటానికి అంగీక రించలేదు జానకమ్మ. ఇవి, ఈ రోజులు వేదవతికి చాలా భారంగా, దిగులుగా గడు స్తున్నాయి. ముగ్గురాడ పిల్లలకు తల్లి ఇప్పుడు. వేదవతి ఒక చిన్న ఎలిమెం టరీ స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది. మూర్తి ఏదో ఆఫీసులో పనిచేస్తున్నాడు. అతనికి మూడు వందల దాకా జీతం వస్తుంది. నెలనెలా తండ్రికి వంద రూపా యలు పంపుతాడు. తండ్రికి పెద్దకొడుకు, తల్లి ఇంకా కని పెంచే మనిషి; కొడుకు పంపే వందా భద్రంగా బ్యాంకులో వేస్తాడు మూర్తి తండ్రి. మిగిలిన రెండు వందల్లో ఇంటి అద్దె అరవయి రూపాయలు, కరెంటు బిల్లు అయిదు రూపాయలూ. బియ్యం నలభయ్ కే. జీలూ తెచ్చి పడే స్తాడు. మిగిలిన ఖర్చులన్నీ వేదవతి జీతం లోంచి జరుపుతుంది. అతని బస్సు ఖర్చు లకీ, కాంటీనులో కాఫీలకీ, సిగరెట్లకీ చిన్నచిన్న సరదాలకీ అతని జీతంలోంచే దాచుకుని ఖర్చుపెడతాడు.


"ఏమిటండీ. మరీనూ! పెళ్ళి అయి పదేళ్ళు దాటుతూంది. ముగ్గురు పిల్లల తండ్రి అయినారు. ఇంకా మీ వాళ్ళకి "వందా" నెలనెలా ముద్దర గుద్దిగా పంపి స్తోంటే ఎల్లాగు?"

"నా జీతంలోంచి నేను పంపుతున్నాను నీ సంపాదన ఏం చేస్తున్నావని నేను



ఎప్పుడన్నా అడిగానా? పిల్లల్ని కన్న దానివి. నీ సంపాదన వాళ్ళకోసం దాచా లని నీకు తెలీదా? నా వాళ్ళకి నన్ను కని పెంచినందుకు ఆ మాత్రం సాయం చేయటం నా కనీస ధర్మం. నేనేం కట్న కానుకలు కోరానా మిమ్మల్ని? చదువు కొన్నదానివి. ఏదో చిన్న ఉద్యోగస్తు రాలివి ఇద్దరం సంపాదించుకుంటాం. ఆర్థిక బాధలు తెలుసున్నదానివి అని నిన్ను చేసుకున్నాము. కట్నాలు కానుకలు తెచ్చిన భార్య అయితే. ఇల్లా హుకుములు చేస్తుందనే నిన్ను చేసుకున్నాను. ఎప్పుడూ కూడా నా వాళ్ళకి పెడ్తున్నాననే ఏడుపు నీకు రాకూడదు."






ఇన్నాళ్ళు నేను ఏమన్నా అన్నానా. పిల్లలు ఎదుగుతున్నారు. నాదా ఎదుగూ బొదుగూ లేని జీతం; అక్కడికి పని చేసే మనిషిని మాన్పించాను. నా జీతం నిత్యావసరాలకే బొటాబొటీగా సరిపోతుంది. పిల్లలు ఎదుగుతున్నారు. వాళ్ళకి చదువుసంధ్యలు చెప్పించాలి. పెళ్ళిళ్ళు చేయాలి. డబ్బు లేకపోతే ఎల్లాగు? నేను చిన్న కానుకలు తేలేనిమాట నిజమే. మా నాన్నగారి బాధ్యతా రహిత ప్రవర్తనవల్ల మేము నిరాధారంగా నిలబడ్డాము. నాలా నా పిల్లలు బాధపడకూడదని. వున్న దాంట్లో అపురూపంగా, ఆత్మీయతగా పెరగాలని నా కోరిక. అంతే."

కన్నీళ్ళు వచ్చాయి వేదవతికి.

"మీ అమ్మ ఉద్యోగస్తురాలు కాదు. కనుక మీరు బాధపడేవారు. నీకేం రోగం? స్వతంత్రురాలివి. ఉద్యోగం చేసుకుంటున్నావు. చదువుకొన్నావు. నీ డబ్బు. నీ సంపాదన నేను కానీ అయినా తీసుకుంటున్నానా? నా దాంట్లోనే ఇంకా, ఇంటి అద్దె, బియ్యం మొదలయిన పెద్ద ఖర్చులన్నీ జరుపుతున్నాను. నీ సంపాదన నాకేమన్నా పెడుతున్నావని ఏడుపుగా వుంటె నువ్వూ, నీ పిల్లలూ వేరువెళ్ళిపోండి." అంటూ బయటకు వెళ్ళిపోయేడు ఈమధ్య తరుచూ ఇలాంటి మాటలు పడటం అలవాటు అయిపోయింది వేదవతికి. తండ్రి ఎప్పుడూ నువ్వూ, నీ పిల్లలూ గంగలో దూకి చావండి అంటుండేవాడు. ఇతను నువ్వూ నీ పిల్లలూ వేరుగా వెళ్ళిపోండి అంటున్నాడు. పేరుకి ప్రేమ వివాహం తమది; పదేళ్ళుగా సంసారం చేసి తనకి ముగ్గురు ఆడపిల్లల్ని కన్న భార్యని ఎంత తేలిగ్గా వెళ్ళిపో, అని అనగలిగాడు. ప్రేమ అభిమానం, సంసారం పట్ల విడతీయలేని మమతానురాగాలు స్త్రీకి ఒక్కదానికేనా వుండేవి? తాను స్వతంత్రురాలయివుండీ తన పిల్లల్ని తను పోషించుకో కలిగి వుండీ తన భర్తని తను ఎందుకోసం వదలలేకపోతోంది?

మగవాడు బాధ్యతగా చూసినా, చూడకపోయినా, మన సాంఘిక పరిస్థితులలో ఒక మగవాడు, వాడు తాగుబోతు కానీండి, వ్యభిచారి కానీండి, వుంచుకున్నదాన్ని ఇంటిలోకి తెచ్చి భార్య కళ్ళముందు వుంచుకున్నదానితో సరసాలాడుతూ వున్నవాడయినా సరే. ఆ మగవాడి నీడను వున్న సంసారానికే విలువనిస్తున్నారు. మిధ్యాగౌరవమయినా సరే అగౌరవం మీద మమకారాన్ని మధ్యతరగతి మహిళ వదులుకోలేదు. నాటికీ నేటికీ కాలం ఎంత మారినా మధ్యతరగతి మహిళ మనస్తత్వంలో మటుకు మార్పురాదు. భర్తని వదిలి జీవించాలంటే ఏదో అవ్యక్తమయిన భయం శరీరమంతా జరజరా ప్రాకి. ఇంకోలా జీవించాలంటే దిగులు పట్టుకుంటుంది. కన్నెవయస్సులో భర్త అనురాగపూరితుడై తన్ని అన్ని విధాలా సుఖపెట్టాలనీ బంగారు కలలు జరీ దారాలతో అల్లుకుంటారు. ఆ కలలు కలలైనా, శూన్య హృదయంతో అల్లానే బ్రతుకు నావని దిగుళ్ళతో కృంగిపోతూ నడుపుకొంటారు స్త్రీలు.

ఆ నాడు చదువు, ఆస్తి లేని జానకమ్మ భర్తని తాగుబోతూ, జూదరి, వ్యభిచారీ అయిన భర్త నీడని ఎందుకోసం వదలలేక పోయిందో. ఈ నాడూ చదువూ ఉద్యోగం వుండికూడా ప్రతినిత్యమూ భర్తచేత నువ్వెళ్ళిపో, నువ్వు వెళ్ళిపో అనిపించుకుంటూ కూడా భర్త నీడని వదలలేకపోవటానికి ఒకటంటే ఒకటే కారణం; మానసిక బలహీనత; జీవితం ధైర్యంగా ఎదుర్కోలేని పిరికితనం; మిధ్యాగౌరవాలమీద అమిత లోభత్వం?

★

